క్లుప్తంగా

మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధించాలి

రాజమహేంద్రవరం రూరల్: మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధించాలని నాబార్డు ఏజీఎం డాక్టర్ వైఎస్ నాయుడు అన్నారు. కొంతమూరులో శక్తి స్వయం సహాయక సంఘం ద్వారా ఏర్పాటు చేసిన గ్రామీణ గిరిజన ఉత్పత్తుల అమ్మక కేంద్రాన్ని (రూరల్ మార్ట్) మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ఈ మార్ట్ అమ్మి లాభాలను సమకూరుస్తుందన్నారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా మారడానికి తోడ్పాటునిస్తుందన్నారు. రాజమహేంద్రవరం ఏఏఎల్‌పీఈఅండ్ ఎన్‌జీవో పర్యవేక్షణలో ఈ మార్ట్ నడుస్తుందని తెలిపారు. ఏఏఎల్‌పీఈఅండ్ ఎన్‌జీవో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఫ్రాంక్లిన్ ఫ్రె మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పి.విజయ్ కుమార్, డ్వాక్రా గ్రూప్ లీడర్ బి.సుగణ, శక్తి స్వయం సహాయక సంఘ సెక్రటరీ పి.రమాప్రభ, ఉప్పలపాటి మోహనరావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 16 మందికి జరిమానా

రాజమహేంద్రవరం రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 16 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం రాజమహేంద్రవరం మూడో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయమూర్తి ఎస్.శ్రీరమ్య తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనం నడిపిన వీరిని ట్రాఫిక్ - 2 ఇన్‌స్పెక్టర్ చింతా సూరిబాబు కోర్టులో హాజరు పరిచారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగంగా మద్యం తాగినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి.నరసింహ కిశోర్ హెచ్చరించారు. జిల్లాలో ఈ నెలలో ఇప్పటి వరకూ 318 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

కార్తిక ఏకాదశి ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న చందన నాగేశ్వర్, చిత్రంలో రావిపాటి రామచంద్రరావు

కడియం: కార్తిక ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాల స్వామి ఆలయంలో దీపోత్సవం జరిగింది. వేమగిరిలోని ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, తమలపాకుల పూజలు, సిందూరార్చనలు చేశారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వాతావరుణం



కోతకు సిద్ధమైన వరిచేను, ఆకాశంలో కమ్ముకున్న మబ్బులు

- వర్ష సూచనతో రైతుల కంగారు
- చేతికందే దశలో వరి పంట
- కోత దశకు వచ్చిన చేలు

కడియం: వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియక కంగారు పడుతున్నారు. భారీ వర్షాలు కురుస్తాయని వస్తున్న వార్త నేపథ్యంలో హడావుడిగా పనులు చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో వాతావరణం గతానికి భిన్నంగా మారుతోంది. ఎప్పుడెలా ఉంటుందో తెలియడం లేదు. ప్రస్తుతం పంట కోతకు వచ్చిన సమయంలో ఆకాశంలో మేఘాలు కమ్ముకుని, అక్కడక్కడా జల్లులుగా వాన పడుతోంది.

12 వేల హెక్టార్లలో వరి సాగు

రూరల్ నియోజకవర్గం పరిధిలోని రూరల్, కడియ మండలాల్లో సుమారు 12 వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. ముందుగా ఊడ్పులు పూర్తి చేసిన రైతులు కోతలను కూడా ప్రారంభించారు. సుమారు 10 శాతం విస్తీర్ణంలో మాత్రమే ప్రస్తుతం కోత దశకు వచ్చిందని రైతులు చెబుతున్నారు. మిగిలిన 90 శాతం పంట ఇంకా చేలల్లోనే ఉంది. రానున్న 20 రోజుల్లో కోతలు ముమ్మరం కానున్నాయి.

రైతుల ఆందోళన

రానున్న మూడు రోజుల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ముఖ్యంగా దక్షిణ కోస్తాకు వర్ష సూచనలు చెప్పడంతో రైతుల్లో ఆందోళనను పెరిగింది. గింజ పాలుపోసుకునే దశలో కురిసే అకాల వర్షాలు దిగుబడులపై ప్రభావాన్ని చూపుతాయని రైతులు చెబుతున్నారు. దీనివల్ల 40 బస్తాల లోపు దిగుబడి వస్తుందని అంచనా వేసిన చేలల్లో సైతం 30 బస్తాల్లోపే దిగుబడులు వస్తున్నాయంటున్నారు. ఇప్పుడు పంట కోతలకు సిద్ధమైన వేళ వాతావరణం మారిపోవడంతో రైతులు కంగారు పడుతున్నారు. దిగుబడులు తగ్గినప్పటికీ పంట చేతి కొస్తే చాలన్న రీతిలో రైతులు ఉన్నారు. అయితే వాతావరణం అందుకు సహకరిస్తుందా అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

భయపెడుతున్న వాతావరణం

నియోజకవర్గంలో స్వర్ణ, ఎంటీయూ, సన్నాలు తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ఎంటీయూ రకం కోతకు రావడానికి ఇంకా పది నుంచి ఇరవై రోజుల వరకు వేచి ఉండాలి. ఈ లోపు వాతావరణం సహకరిస్తేనే రైతులు గట్టెక్కుతారు. లేకపోతే దిగుబడి నష్టం తప్పదు. అలాగే అధికంగా ఎరువులు వినియోగించిన చేలల్లో ఇంకా వరి దుబ్బులు పచ్చదనంతోనే ఉన్నాయి. కడియం మండలంలోని వేమగిరి, కడియం, జేగురుపాడు, దుళ్ల తదితర గ్రామాల్లో వరి కోతలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి కూడా వాతావరణం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. తేమ శాతంపై వెసులుబాటును ఇచ్చి ప్రభుత్వం తక్షణం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

వర్ష సూచనతో ఆందోళన

> దక్షిణ కోస్తాకు వర్ష సూచన చెప్పడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పంటకు కోతకు వచ్చిన దశలో వర్షం కురిస్తే నష్టం కలుగుతుంది. రైతులకు పెట్టుబడులు కూడా పెరిగిపోతాయి. దిగుబడి అంతంత మాత్రంగా ఉంది. భారీ వర్షాలు పడితే రైతులకు ఇబ్బందులు తప్పవు.
> – కె.నరసింహమూర్తి, రైతు, వేమగిరి

15న పట్టభద్రుల ఓటు నమోదు శిబిరం

సీటీఆర్ఐ: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు తమ సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఓటరు నమోదు శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఈ విషయం తెలిపారు. రామారావు మాట్లాడుతూ అవసరమైన పత్రాల జిరాక్సులను తమకు అందజేస్తే, వాటిని ఫారం 18తో పాటు తహసీల్దార్ కార్యాలయంలో తామే అందజేసి ఓటర్లుగా నమోదు చేయిస్తామన్నారు. డిగ్రీ ప్రొవిజన్ సర్టిఫికెట్ (గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్టేషన్ చేయించింది), ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఓటరు గుర్తింపు కార్డు (తప్పనిసరి కాదు) జిరాక్సు పత్రాలను శిబిరానికి తీసుకురావాలన్నారు. సమావేశంలో సంఘం డిప్యూటీ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు డి.జార్జి ఆంటోని, సభ్యులు మట్టపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

కడియం మండలంలో ట్రైనీ కలెక్టర్ల పర్యటన



జేగురుపాడులో పర్యటిస్తున్న ట్రైనీ కలెక్టర్ల బృందంతో సర్పంచ్ స్టాలిన్, అధికారులు, ప్రజాప్రతినిధులు

కడియం: శిక్షణలో ఉన్న కలెక్టర్లు రెండు రోజుల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కడియం మండలం జేగురుపాడు, పొట్టిలంక గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన పది మంది ట్రైనీలు రెండు బృందాలుగా ఈ పర్యటనలో పాల్గొన్నారు. తొలుత జేగురుపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని అనురాగ్ బాబెల్ (టీమ్ లీడర్), ప్రియా రాణి, ఎస్.బేగం, పారత్, కె.బక్షి బృందం పరిశీలించింది. ముందుగా వీరికి గ్రామ సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ ఘన స్వాగతం పలికారు. అనంతరం తమ గ్రామంలో జరిగిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ, సేంద్రియ ఎరువుల ఉత్పత్తి తదితర అంశాలను బృందం పరిశీలించింది. జిల్లా పంచాయతీ అధికారి ఎం.నాగలత, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, ఎంపీడీవో కిశోర్, ఏవో సుబ్బారావు, ఈవోపీఆర్డీ రాంప్రసాద్ ఆయా పథకాల పనితీరును ట్రైనీ కలెక్టర్లకు వివరించారు. రైతు సేవా కేంద్రంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు, అంగన్‌వాడీ కేంద్రంలో రాజానగరం పీడీ కె.విజయ కుమారి, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ జ్యోత్స్న తదితరులు వివిధ సేవలను వివరించారు. అనంతరం కమ్యూనిటీ హాల్లో వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వ పథకాల వివరాలను డిజిటల్ స్క్రీన్ ద్వారా ఆయా శాఖల అధికారులు ట్రైనీ కలెక్టర్లకు వివరించారు.

పొట్టిలంకలో..

పొట్టిలంకలో ట్రైనీ కలెక్టర్లు నిరంజన్ జయదేవరావు (అసిస్టెంట్ టీమ్ లీడర్), టి.నాగి, ఏ.మిశ్రా, స్నేహ పన్నా పర్యటించారు. వీరు కూడా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు పరిశీలించారు. వీరికి ఆ గ్రామ సర్పంచ్ కొత్తపల్లి సత్యవతీ వేంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కలిదిండి విశాలాక్షి గోవిందు స్వాగతం పలికారు. డీఎల్‌డీవో వీణాదేవి, జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు, హెచ్‌వో సుజాత కుమారి, అగ్రికల్చర్ ఏడీ టీవీఎస్ రెడ్డి, సీడీపీవో కనకవల్లి తదితర అధికారులు ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులు వివరించారు. కాగా బుధవారం కూడా ట్రైనీ కలెక్టర్‌ల బృందం కడియం మండలంలో పర్యటించనుంది.

కృత్రిమ అవయవాల పంపిణీకి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ: జిల్లాలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులను ఆదుకునేందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఆర్టిఫీషియల్ లింబ్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో 2023–24 సంవత్సరానికి రూ.13.22 లక్షలతో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్లు, చెవికి సంబంధించిన పరికరాలు, చేతి కర్రలు తయారు చేసే మెషినరీ, ఆఫీస్ ఫర్నిచర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దివ్యాంగులకు సంబంధించిన పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను స్వీకరించి, దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలను ప్రతి నెలా మొదటి సోమవారం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



ర్యాలీలో మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకట సుబ్బరాజు

రాజమహేంద్రవరం రూరల్: మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజు విద్యార్థినులకు సూచించారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు మంగళవారం ఏఎస్పీ సుబ్బరాజు, సౌత్‌జోన్ డీఎస్పీ భవ్య కిషోర్, మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి ఆధ్వర్యంలో మహిళా రక్షక్ సిబ్బందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఏవీ అప్పారావు రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, కోటిపల్లి బస్టాండ్, దేవీచౌక్ మీదుగా మహిళా పోలీస్ స్టేషన్ వరకూ ఈ కార్యక్రమం జరిగింది. సుమారు 60 మంది మహిళా రక్షక్ సిబ్బంది దీనిలో పాల్గొన్నారు. మహిళల్లో ధైర్యాన్ని నింపి, వారికి పోలీసులు అండగా ఉన్నారనే భరోసా ఇవ్వడానికే ఈ బైక్ ర్యాలీ జరిపారు.

నియోజకవర్గాలకు కాపునాడు అధ్యక్షుల నియామకం



నియామక పత్రాలు అందజేస్తున్న రఘు నరేష్ తదితరులు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, రాజానగరం నియోజకవర్గాలకు కాపునాడు నూతన అధ్యక్షులను నియమించినట్లు కాపునాడు పార్లమెంటు అధ్యక్షుడు గుదే రఘు నరేష్ తెలిపారు. గతంలో నియమించిన అధ్యక్షుల పదవీ కాలం పూర్తవడంతో నూతన నియామకాలు చేపట్టామన్నారు. ఈ మేరకు మంగళవారం దేవీచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో రాజమహేంద్రవరం అర్బన్ అధ్యక్షుడిగా విన్నా వాసు, రూరల్ అధ్యక్షుడిగా దేశినీడి రాంబాబు, రాజానగరం అధ్యక్షుడిగా కాళ్ల చక్రరావుకు నియామక పత్రాలు అందజేశారు. సంఘీయులకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తోడ్పాటును అందించి, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రఘు నరేష్ సూచించారు. దివాన్ చెరువు సమీపంలో ఈ నెల 24వ తేదీన జరిగే కాపునాడు కార్తిక వన సమారాధనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ముమ్మిడి వీరబాబు, ర్యాలీ రామకృష్ణ, వురింకల సతీష్, పిల్లా దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమలాకరరావు మృతి తీరని లోటు

సీటీఆర్ఐ: ప్రఖ్యాత మృదంగ విద్యాంసుడు వరదరావు కమలాకరరావు (88) మృతి సంగీత లోకానికి తీరని లోటు అని సద్గురు సన్నిధి వ్యవస్థాపకుడు శిష్టు మధుసూదన్ అన్నారు. ఆయన సోమవారం రాజమహేంద్రవరంలో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు సంగీత విద్వాంసుల మంగళవారం సంతాపం తెలిపారు. ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పిన్న వయసులోనే మృదంగ విద్వాన్‌గా పేరొందిన కమలాకరరావు కళాశాల విద్యార్థిగా అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చేతులు మీదుగా కేంద్ర పురస్కారం అందుకున్నారన్నారు. ద్వారం వెంకటస్వామి నాయుడు వంటి వయోలిన్ విద్యాంసులను మొదలుకుని జీఎస్ బాలసుబ్రహ్మణ్యం, టీకే రంగాచారి, మంగళపల్లి బాలమురళీకృష్ణ వంటి వారికి మృదంగ సహకారం అందించారన్నారు.

మైనార్టీలకు దక్కని ప్రాధాన్యం



షేక్ నిజాం

సీటీఆర్ఐ: కూటమి ప్రభుత్వం రెండో విడత భర్తీ చేసిన నామినేటెడ్ పదవులలో మైనారిటీలకు ప్రాధాన్యత దక్కలేదని ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ నిజాం అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ టాప్ టెన్ కార్పొరేషన్లలో ఇద్దరు ముస్లింలకు చోటు కల్పించారన్నారు. అదేగాక ఏపీ ఆయిల్ ఫెడరేషన్ కార్పొరేషన్, ఏపీ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్, ఏపీ స్టేట్ టైలర్ ఫెడరేషన్ కార్పొరేషన్‌లను కూడా మైనారిటీలకు కేటాయించారన్నారు. మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పరిధిలో హజ్ కమిటీ, వక్ఫ్ బోర్డు, ఉర్దూ అకాడమీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, నూర్ బాషా దూదేకుల ముస్లిం కార్పొరేషన్, షేక్ కార్పొరేషన్, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్లకు ముస్లింలను చైర్మన్లుగా నియమించారన్నారు. ముగ్గురు మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారులకు క్యాబినెట్ హోదా ఇచ్చారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన జనసేన 13 కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కించుకుందన్నారు. వాటిలో ఒక్కటి కూడా ముస్లిం మైనారిటీలకు పవన్ కల్యాణ్ కేటాయించలేదన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక కార్యదర్శి మతల రమేష్, తృతీయ శ్రేణి గ్రంథాలయాధికారి పి.శ్రీదేవి మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

21న గాయత్రీ హోమం, అన్నసమారాధన

రాజానగరం: కార్తిక మాసం సందర్భంగా స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ఈనెల 21న గాయత్రీ హోమం, కార్తిక అన్న సమారాధన నిర్వహించనున్నారు. అమలాపురంలోని రామానందస్వామి శిష్యపరివారం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో 11 యజ్ఞ కుండీలను ఏర్పాటు చేసి, 44 జంటలతో ఉదయం 9 గంటల నుంచి గాయత్రీ హోమం నిర్వహిస్తారు. హోమంలో పాల్గొనే భక్తులకు హోమ ద్రవ్యాలను ఆలయ కమిటీ ఉచితంగా అందిస్తుంది. అనంతరం 11 గంటల నుంచి ఆలయం పక్కనే గల మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో కార్తిక అన్న సమారాధన నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలకు భక్తులందరూ తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

సమస్యను పరిష్కరించాలని డీజీపీకి వినతి



అమరావతిలో డీజీపీ కార్యాలయం వద్ద ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు

సీటీఆర్ఐ: కొందరు తాము ఫైనాన్స్ చేసిన వాహనాలను అనధికారికంగా తనఖా పెట్టడం, వాయిదాలను సక్రమంగా చెల్లించకపోవడం చేస్తున్నారని స్టేట్ ఆటో ఫైనాన్షియల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వల్లెపు మంగరాజు తెలిపారు. వారి వల్ల ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో మంగళవారం అమరావతిలో రాష్ట్ర డీజీపీని కలిసి సమస్యను వివరించి, వినతిపత్రం అందజేశామన్నారు. ఆయన తమ సమస్యపై సానుకూలంగా స్పందించారన్నారు. తాము అర్హులైన వ్యక్తులకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్ల కొనుగోలు కోసం ఫైనాన్స్ చేస్తున్నామన్నారు. వారి నుంచి వాహనాల హైపోథెకేషన్ పొందుతున్నామన్నారు. కొన్ని వాయిదాలు చెల్లించిన తర్వాత కొందరు ప్రైవేటు వ్యక్తుల వద్ద వాహనాలను తనఖా పెట్టి వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. వాహనాల హైపోథికేషన్ విషయం థర్డ్ పార్టీలకు తెలిసినా వాటిని తనఖా పెట్టి ఫైనాన్షియర్లకు వాయిదాల సొమ్మును చెల్లించకుండా చేస్తున్నారన్నారు. డీజీపీని కలిసిన వారిలో కృష్ణుడు, లోవరాజు, ఫణిమోహన్, కందుల వెంకటరెడ్డి, మధు, జూలకంటి సురేష్ తదితరులు ఉన్నారు.

అంతా వారిష్టమే..



వ్యవసాయ మార్కెట్ కమిటీ షాపుల ముందు నిర్మించిన పక్కా షెడ్లు

- షాపుల ముందు అదనపు షెడ్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- వ్యవసాయ మార్కెట్ కమిటీలో షాపుల యజమానుల తీరు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అద్దెకు తీసుకున్న షాపుల ముందు ఉన్న స్థలంలో కొందరు పక్కా షెడ్లు నిర్మించి యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారు. దీంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కోరుకొండ రోడ్డు వైపు సుమారు 29 షాపులు ఉన్నాయి. 2022లో ఈ – కొనుగోలు ద్వారా 20 షాపులను రైతులు, వ్యాపారులు అతి తక్కువ ధరకే దక్కించుకోవడం జరిగింది. వీరిలో కొందరు తమ షాపులను వేరే వారికి ఇచ్చి, వారి నుంచి అద్దెను అధికంగా వసూలు చేస్తున్నారు. మిగిలిన తొమ్మిది షాపులకు బహిరంగ వేలం నిర్వహించగా వ్యాపారులు వేల రూపాయలకు పాట పాడుకున్నారు. అయితే అద్దెలు చెల్లించలేక రెండు నెలలకే కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ షాపులు అప్పటి నుంచి ఖాళీగానే ఉన్నాయి.

పక్కా షెడ్ల ఏర్పాటు


వ్యవసాయ మార్కెట్ కమిటీ షాపులకు చెందిన కొందరు వ్యాపారులు తమ షాపుల ముందు ఖాళీగా ఉన్న స్థలంలో భారీగా పక్కా షెడ్లు నిర్మించారు. షాపు విస్తీర్ణం కంటే ముందు వేసిన షెడ్లు ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, కూటమి నేతల ఒత్తిడి మేరకు అధికారులు వీటిపై ఎటువంటి చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. అదనంగా వేసిన షెడ్లకు సంబంధించి ఆయా షాపుల యజమానుల నుంచి అదనంగా అద్దె వసూలు చేయాలని పలువురు కోరుతున్నారు.

అదనంగా అద్దెలు వేస్తాం



> వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో షాపుల ముందు నిర్మించిన పక్కా షెడ్లకు అదనంగా అద్దెలు వేస్తాం. అలాగే జరిమానా కూడా విధిస్తాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం.
> – డి.శ్రీనివాసరావు, ఉన్నతశ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, రాజమహేంద్రవరం

సినిమాలు



శ్యామల	: బ్లడీ బెగ్గర్
సూర్యమినీ	: రహస్యం ఇదం జగత్
సూర్యప్యాలెస్	: ధూమ్‌ధామ్
శివజ్యోతి	: క
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీభాస్కర్
రాజా	: అమరన్
రంభ	: బఘీర, భూల్‌భులయ్యా-3
ఊర్వశి	: అమరన్
మేనక	: జితేందర్‌రెడ్డి
కుమారి	: దేవర
అప్సర	: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
నామవరం	
వీఎస్ మహల్	: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో, క
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: అమరన్
కడియం	
వెంకటసూర్య	: క